
# నేనూ నా రాజ్యం



శ్రీ బి. శ్రీనివాసరావు, బి. ఏ.

అయితే, బాబయ్యగారూ! యీసారి వరీచ్చ కూడ పస్టుకళాసులో పాసుచేసినారు. బి.ఎ. లోకివచ్చారు. మొన్న దసరా పండక్కు తమరు శెలవిచ్చినవకారం, యీనాము దయచేయించరూ" అన్నాడు మా కాలేజీ జవాను.

"సరేకాని, నా సూట్‌కేసు, బెడ్, ఎక్కడ పెట్టావురా?"

"యిట్టరు కళాసులోపెట్టి, ఒక పలకమీద పడక వరచాను బాబయ్యా."

ఇదిగో నని ఒక అర్ధరూపాయి బిళ్ళ పర్సులో నుండి తీసి హ్యానుకిచ్చి, ఇంటరు కంపార్టుమెంటులోకెక్కి, కోటుతీసి 'హాంగరు'కు తగిలించి, పరిచివున్న పడకపై కూర్చుని, అప్పుడే కొన్న 'పత్రికను' తీసి. నా స్నేహితుడు వ్రాసిన హాస్యపూరిత హ్యాసముకోసం పేజీలు తిరుగవేస్తూవుండే సరికి గార్డు బిగులు వూదడము, రైలు బండి. మెల్ల మెల్లగా బందరు ప్లాటుఫారము విడిచి పెట్టడము సంభవించింది.

మా నాయన పోలీసు వుద్యోగస్థుడు. అంచేత, నేను మాత్రం, మొదటినుంచి బందరు హాస్టలులో నుండి చదువుకోవడము శెలవులకు మా నాయన నేవూరుబదిలీచేస్తే ఆవూరు వెళ్ళడము మామూలు. మామూలు తప్పించకుండా, యీసారి జనవరి శెలవులకు నాయుడుపేటలో వుండటము, నేను నాయుడుపేట వెళ్ళడము సంభవించింది. రెండు రోజులు విసువు, విరామము లేకుండా విచ్చల విడిగాబెజవాడంతా తిరిగి, మూడవనాడు మూటాముల్లేసర్దుకొని బెజవాడ ప్లాటుఫారంమీద మెయిలు కోసం సిద్ధముగా వున్నాను.

"హలో! ఆచార్! నీవట్రా, నేనెవరో అనుకున్నాను. యేమిటీ హడావిడి అంతా యిదొహకలగూరగంపలా కుక్కినావేమిటి" అని సంచిలోని 'పారఫర్నేలియా' నంతా నాకున్న స్వతంత్ర్యమును రవంతా మిగల్చక. బయటకు తీసే సరికి, దానిలోని, రెండు పెడన లుంగీచీరెలు, బందరు సాదా లడ్లు, బందరు గట్టి పకోడీ, చక్కెరకేళీ పండ్లు, చామంతి పువ్వులు, మొదలైనవి బయట పడినవి. బాగానే వున్నది సరంజామా అంతా. ఎవరికిరాయివన్నీ. కొంపతీసి మన భార్యకు కాదుగదా!

యీ ఆచారి కొంచెము షోకు పురుషుడు, కాని వుత్త అమాయకుడు. చిన్నప్పుడే పెండ్లి చేశారు. నా క్లాసుమేటు. అయితే క్లాసులో యితనిని మనిషి క్రిందకట్టి ఎవరూ యీతనితో మాట్లాడరు. ఒకడు రోజు క్లాసు బయట, తన చమత్కారము అంతా చూపెడుతూ, "అరే! మిష్టర్ ఆచారీ! నీ భార్య ముండమోస్తే నీకు భోజనము ఎవరు వండి పెడతారురా?" అంటే "యేమి, మా అమ్మ నిక్షేపములా వండి పెడుతుంది" అని బదులు చెప్పినట్టి!—బుద్ధిశాలి, ధీశాలి కూడాను.

"ఎంత చేసుకున్న అమ్మకు అంతే ఫలమన్నట్లు, యేమి చెయ్యమంటావురా. నా ఖర్మం యీలా తగులడింది. ఎవరికైనా తట్టుకోవచ్చు. చివరకు హిట్లరుబాంబుకైనా తట్టుకోవచ్చును గాని, యీకాలపు భార్యల ఆటుపోటులకు తట్టుకోవడము గొప్ప గండము గడిచి గట్టెక్కినట్టేరా. అందుకనే Sexton Blake అనే వాడు, "wife is knife to cut on life" అని సరిగా చూచినట్టుగా చెప్పాడు; కాని, నీకు యీ కఠినశిక్ష కొద్ది రోజులలో తప్పదులేరా. అప్పుడు గాని, నీకిదంతా కాంపౌండు వడ్డీతో సహా అనుభవమునకు రాదు. నీ వివాహ విషయమై, యీమధ్య కుదిరిన క్రొత్త సంబంధం విషయము, నాకు తెలియదనుకున్నావు గాబోలు" నని అంటూ బాపట్ల స్టేషనులో దిగి, "గుడనైట్ వస్తానురా!" అని దారిపట్టాడు.

రైలు సువర్ణముఖినదిని దాటింది. స్టేషను వస్తుందని బల్లక్రిందనున్న బూటువేసుకుని క్రాపు నున్నగా దువ్వకుని, కాలరు సరీగా సర్దుకొని, క్రొత్తబ్లేజరు కోటును ఫాషనుబుల్‌గా ఎడమచేతికి మాత్రమే తొడిగి, కుడిచేతికి Max ply రెన్నిసు బాటును సింగారించి, అంతులేని గర్వముతో, రైలు ఆగక పూర్వమే ఎంతో అనుభవం వున్నవానివలె అమాంతంగా దిగి మా పోలీసు జవానుకోసం ఎదురుచూస్తూ వున్నా.

స్టేషనుకు జవాను తీసుకువచ్చిన బస్సులో యెక్కి,—యేమంటే, పోలీసువాళ్ళకు బస్సులు ఫ్రీకదూ, అందుకని బస్సులు, మాకు ప్లజరు కారులు లాగన్నమాట!-యింటికివచ్చిస్నానంచేసి. భోంచేసి కొంచెంసేపు పరుండి లేచి, టీ త్రాగే సరికి. మా చిన్న చెల్లె లలితావచ్చి, నాకు బందరునుంచి యేమితెచ్చినావన్నయ్యా అని అడిగింది. నీకు జర్మను బాంబరువిమానమొకటి క్రొత్తది తెచ్చానని చెప్పి పెట్టెలోనుంచి తీసి యిచ్చి, కొన్ని జాబులుంటే, పైపు చేస్తామని వరండాలో నున్న టేబిలుమీద రాయల్ ఫోర్టబుల్ తెరచి లెటర్‌పేపరును రబ్బరురోలరు మధ్య పెడుతూ వుండగా నాకళ్ళయెదుట షుమారు 20 గజముల దూరములో, ఎదురింటి గోడమీద, పూలచెట్టు ప్రక్కన నిలబడి వయ్యారంగా పువ్వులు అందుకొంటూ శరత్కాలములో మెరుపు మెరసినట్లు, నా కన్నులు మిరుమిట్లు గొల్పునట్లుగా మెరసింది లేత యౌవనపు అందగత్తె ఒక ఆమె. మెరపుతీగె అనడంలో అతిశయోక్తి యెంతమాత్రమూలేదు, రంభ ఊర్వశి తిలోత్తమలను వర్ణించే శృంగార కవుల వర్ణనల

ఛాటి కాగలేకపోయినా, అలేత పసిడిబంగారు ఛాయ, తుమ్మెదలను మరపించే ఆ నల్లని కేశాలు పుష్పవల్లి కన్నులు, శాంత యాప్టీ చలాకీ, కన్నన్ బాలా చిరునవ్వు, మొదలైన సౌందర్య విశేషములు అమెకు వన్నె బెట్టాయేమో ఒక చుక్కలాగు నా కండ్లల్లో మెరసి ప్రతిఫలించింది.


నాకు కొంత వయస్సు వచ్చినప్పటినుండి నిజము దాచకూడదు కాని, మంచి అందము గల స్త్రీలను చూడడమనినా, వాళ్ళ గురించిన మాటలాడడమనినా, వారితో వారితో సంభాషించడమనినా మహా చెడ్డ సరదా! చెప్పరాని సంతోషం అంతులేని ఆనందం, కలుగడం నాలో సహజముగా వుండే జబ్బు.

అంత స్వేచ్ఛగా ఆ కన్యను, కన్నులనిండార చూడగానే, నా రక్తనాళములలోని రక్తము కొంచెము నేపాగిపోయింది. నానాటి శృంగారమును సూచిస్తూ వుంటే, అలాగే నేను రెండునిమిషములు, కాలూచెయ్యాడక నిశ్చేష్టుడనైపోయాను. అంతకుముందు శృంగార విషయాల్లో, జోక్యము కలుగజేసుకోవాలనే భ్రమేతప్ప, అంతగా ప్రవేశం లేదు. అయినా యీ అర్థములేని శృంగారము నాకేమీ బోధపడలేదు.

మైపు యెటు పోయిందో, ఉత్తరాలు యెటు పోయినవో, కాని రెండురోజులు పిచ్చిపిచ్చి ఆలోచనలు, బాధలేనిబాధ. అన్నము సహించదు. నిద్ర పట్టదు. యీ పరిభ్రమణకు నాలోనాకే ఆశ్చర్యము వేసింది. ఆపిల్ల విషయమై జాడలుతీయ మొదలుబెట్టాను. మూడవనాటికి, కొంత విషయము గ్రహించాను. ప్రేమ అంటే యేమిటో గ్రీకు అండులాటిన్ లాగ వుండేది. యిప్పుడు దానంతటదే. కష్టించిన శరీరములో, పుట్టే చెమటలాగు పుట్టి, వృద్ధిఅయి, అర్థములేని బాధను కల్గించిన యీ ప్రేమ చెమట నెలాగా తుడిచికొనుటా అని మనోవేదన.

ఆ పరిస్థితులలో నాకు తగినవాడు ఓకుర్రవాడు దొరికాడు. వానితో నా కార్యమును భల్లూకపు పట్టుతో సాధించ సాగినాను.

ఆనాడు సాయంకాలం పూరిబయట నిర్మలముగా పారుతున్న సువర్ణముఖీ నదీతీరములో, ప్రథమ సమాగమం ముందుగానే నిశ్చయించుకున్నాం. అనుకున్న టైముకంటె ఓ గంట ముందుగానే పోయి యెప్పుడా! ఎప్పుడా అని బకధ్యానము చేస్తూ కూచున్నాడు.



కుబేరావారి "మైరావణ"లో రాధాబాయి

భరింపరాని విరహ వేదనకు తోడు, ఎండ తీక్షణము, నేను భరింపలేనేమోనని, నామీద జాలి గొన్నట్లుగనో, లేక నాకు లభించబోయే శృంగార ప్రేమానందమును సహించి ఓర్వజాలకనో గాని, మేఘాలలో తన ముఖాన్ని మరగించుకొంటున్నాడా అన్నట్లు పశ్చిమ దిక్కున తాండవిస్తున్న సూర్యుడు అస్తమిస్తూవుండగా నదీతీర ప్రదేశమంతా మహా అందంగా ప్రశాంతంగా వుంది.

తెల్లగా తోమిన బిందెను నడుమున పెట్టుకొని దానిలో రెండు మధుర చీరెలను పెట్టుకొని, హంస గమనంతో, అనుకున్న ప్రకారం, ప్రత్యక్షమయినది రాజ్యలక్ష్మి.

"నామీద రాజ్యానికి యీ నాటికి దయ వచ్చింది గాబోలునని" పట్టరాని సంతోషానందములతో అన్నాను.

"వున్నా మీ దయ వుండాల్సిగాని పేద పిల్ల దయ మీకెందుకు" అంటూ మనసులోని సంతోషాన్ని కప్పి పుచ్చింది.

"ఏవేదో అనాలని అట్లా అన్నావేగాని, లేకుంటే నీ దయ నా కెంతవసరమో నీకేమి

తెలుసు. చెరకులోని ఆ తీపి చెరకుగడ కేమి తెలుసు! మనసు నిండుగా వున్నప్పుడు మాటలు రావంటారు పెద్దను. నిన్నెంత గాఢంగా ప్రేమిం చానో. నీకేమి తెలుసు, రాజ్యం."

"ఇన్నిటికీ మొగవాళ్ళను నమ్మరాదండి. అవన్ని నా కెందుకుగాని, నేను వెళ్లాలి. ఆలస్య మయితే, మా అమ్మావాళ్ళు కూకలేస్తా?" రని రెండు పిండిన చీరెలు ఒక భుజముమీద బెట్టి, నిండు బిందెను యింకొక భుజముమీద బెట్టి. తీక్షణమైన ప్రేమ చూపు వొక్కటి నాపై విసరి యింటి దారి పట్టి రెండడుగులు వేసింది.

"అయితే! యిదిగో, రాజ్యం! యిటు చూడు! మాట్లాడవు? నేనింతగా కోరిన నా కోర్కె........ అని నేనెంతో దీనంగా మాట్లాడం మొదలు పెట్టాను.

"అబ్బ! రోడ్డుమీద తెలిసినవాళ్ళు ఎవరైన చూస్తే బాగుండదండి. రేపు రాత్రి మా పెరటి వైపు రండీ, తీరుబడిగా మాట్లాడుదాం" అని, ఒక సందు తిరిగి, మరు క్షణంలో మాయమైంది.

"అహా! నేటికి నా రొట్టె సగము నేతిలో పడింది గదా! అని సంతోషం ఒకవైపు తంతూంటే, నా ఒళ్ళు నాకు తెలియక యింటికి పోయి భోంచేసి వెంటనే పడుకున్నాను:

ఆరాత్రి చెప్పరాని వింత వింత కలలు వచ్చాయి.

మరునాడురాత్రి 7 గంటలు కొట్టింది. భోంచేసి 3 సెల్పుబాటరీ లైటు తీసికొని. ""After supper walk a mile" అని పెద్దలు చెప్పినారని యింటిలో చెప్పి ఆ సందు యీ సందు తిరిగి, చివరకు, రాజ్యం వాళ్ళ యింటి పెరటిలోని బావి ప్రక్క నొకమూలంగా కూర్చుని గుటకలు మ్రింగుతూ, 8 గంట లెప్పుడు కొడుతారా అని, రెండు చెవులు నిక్క బొడుచుకొని, కన్నులు గ్రుడ్లుపూడి బయటపడేలాగు తెరచికొని గాఢాంధకారంలో చూస్తూ కూర్చున్నాను. 8 గంటలు కొట్టింది.

తెల్లని చీరకట్టుకొని, ముసుగువేసికొని, ఒక చేత చెంబుపట్టుకొని, రెండోచెయ్యి కొంచెము వూపుకుంటూ, సగమెత్తిన తల సగము దింపిన తలతో దారిచూచుకుంటూ ఒక స్త్రీవ్యక్తి నావైపు సమీపించడము చూచేసరికి నా ఆనందాబ్ధి పొంగి పొరలింది.

"ఆహా! ఇదియే గాబోలును. 'మంచిమనిషి కొకమాట మంచి గొడ్డుకొక దెబ్బ' అంటారు పెద్దలు. అనుకున్న ప్రకారం, ఎవరన్నా చూస్తారని ముసుగువేసికొని, పద్మినీ లక్షణపు స్త్రీ కాబట్టి, తెల్ల చీరకట్టుకుని, చప్పుడు చేయకుండా వస్తూ వున్నది. నామీద యెంత ప్రేమలేకపోతే, యీరాత్రివేళ, నా ప్రాణధనం రాజ్యం నాకొరకై వస్తుందా అని అంతులేని ఆలోచనలు నా హృదయములో పరుగెత్తినవి.

ఇంతలో "నారాజ్యం" అని సంభోధన చేస్తామనుకొని ఆమాట పెదవులు దాటిందో లేదో, ఆ స్త్రీవ్యక్తి సమీపించి, నన్ను చూచి భయపడి.

"ఎ....వ....ర....క్క....డ అని వణుకుతూ అన్నది.

దానితో, నా ప్రాణము అక్షరాల నిలువున నీరై, నోటిమాటరాక, దారి పట్టుదామనుకొనే లోపుగా.

"దొ....ఒం....గా ! దొం....గా....!!!

రం....డ....ర్రా! రం....డ....ర్రా! అని రెండు మూడు కేకలు పెట్టేసింది.

నామతి నాలో లేక, నేనేమి చేస్తూన్నానో నాకే తెలియక, గోడ యెలా దూకానో, ప్రక్కనున్న మురికి కాలవలో పడక దైవవశాత్తున ఎలా తప్పించుకున్నానో, కొంచము పరుగెత్తి, కొంచెము గభాగభా నడిచి, చివరకు యెలా సువర్ణముఖినది వొడ్డునున్న చెట్టుపొదలో ఎలా దాగుకొని వున్నానో నాకే తెలియదు.

ఇంతకూ యెవరామె? రాజ్యం అత్తయ్య, తలచెడిన ఆమె చెంబుతీసికొని అటు వచ్చింది దరిద్రుని పెండ్లికి వడగండ్ల వాన అన్నట్లు, నాపాలిట మారెమ్మలాగ ప్రాప్తించి, నా కోర్కెలన్నీ నీట గల్పి, లేనిపోని గల్లంతు చేసి యిరుగు పొరుగునంతా లేపి వదలింది.

లాంతర్లు తీసికొని కొందరు, కర్రలు తీసికుని మరికొందరు, ఒక రిటైర్డు మిలిటరీ అఫీసరు మూల తుప్పుపట్టివున్న డబుల్ బారెల్ తుపాకి తీసికొని, సందుగొందులు వెతకి, తలా ఒక ప్రగల్భపు మాట మాట్లాడుతూ బయల్దేరారు. వీళ్ళందరూ దొంగను పట్టుకొనుటకే గాబోలు! ఎప్పుడున్నా నిజమైన దొంగను పట్టుకొనుటకు యింత ఆర్భాటము వుండగాదు!

సద్దంతా పూర్తిగా అణగినతర్వాత బ్రతుకు జీవుడా అంటూ మరొకదారిన యింటికి చేరుకున్నాను.

"మొగవాండ్లను నమ్మరాదన్నదే" చివరకు ప్రాక్టికల్‌గా. ఒక ఆడది, నమ్మించి. తడి గుడ్డతో గొంతుకోసినదే. కాబట్టి ఆడవాండ్లను నమ్మరాదు అనడానికి యింతకంటే వేరు నిదర్శనం యేమి గావాలి అని రాజ్యంమీద పట్టరాని కోపముతో పడుండి నిద్రాదేవి వశమైపోయాను. తరువాత కొన్ని రోజులు మా యింటి ముందు వీధిలో. రాజ్యం, ఆ మిషపై, యీ మిషపై తిరిగినా, నేను మాత్రం అమెవైపు కూడా చూడినే గాదు. దైవ వశాత్తు కొంచంలో తప్పింది కాని, లేకుంటే పరువు పోవలసిన పనిగాదు.

తరువాయి, కొన్ని రోజులకు, మా కాలేజి తెరవడము. నేను తిరిగి, బందరు వెళ్లడమూ తటస్థించింది. కాని, నిజమునకు, రాజ్యంమీద ప్రేమ బీజములు మాత్రము పూర్తిగా నశించలేదు. 3 నెలలు త్వరలోనే గతించినవి. మరల ఎండాకాలము శెలవులకు యింటికి నాయుడుపేట వచ్చాను.

దారిలో నెల్లూరివద్ద, నేను కూర్చున్న బండిలో, నాయుడుపేట గ్రామస్థుడు ఒకడు మొఖము ఎరిగిన మనిషి ఎక్కాడు. వానితో బాతాఖాని వేస్తూ, యింకా నాయుడుపేట విశేషము లేమండీ అని అడిగాను.

"ఏమీ లేదండి. మొన్న ఆ తురకల బజారులో ఒక అమ్మాయి 14 సంవత్సరము లుంటవండి పాపం పాపము, బావిలో పడి ఆత్మహత్య చేసికొన్నదండి."

"అయ్యో పాపం! ఎవరు? ఆమె పేరండి? నా రాజ్యం కాదుగదా అని నా మనసులో అనుకున్నాను.

"రావూరి రాజ్యలక్ష్మి అటండి. నాగన్నగారున్నారు చూడండీ, ఆయన కూతురట.

"ఆత్మహత్య చేసుకొనుటకు అసలు కారణమండీ."

"అసలు కారణము మనకు తెలుస్తుందండీ."

"అంటే వూళ్ళో వినికిడెట్లా అని. లోకులు కాకులు వంటివారు గాదండి. వూళ్ళో పుకారేమని?"

"యీమధ్య అమె వివాహ విషయమై, ఒక సంబంధం తల్లి తండ్రి కుదిరిస్తే, ఆ పెండ్లికొడుకు యిష్టములేక వివాహము వద్దని పట్టుపట్టిందట. ఆమె మెడలు విరచి ఆ సంబంధమే చేస్తామని అనేవరకు. అంతమాత్రము తనకు స్వతంత్రము లేకపోయెనే అని ఆత్మహత్య చేసికొని, వరవిక్రయం నాటక మాడినదంట.

అయ్యో పాపము!! అన్నాను. అశ్రుబిందువులు అప్రయత్నముగా జలజల రాలినవి."

చివరకు నా రాజ్యం జీవితం యిలా అయిందా, అని, భరింపరాని దుఃఖముతో మనస్సులో విలపించసాగితిని.

ఇంతలో రైలు, మహా వేగముతో సమీపించి సువర్ణముఖినదిబ్రిడ్జిమీద పోతూవుండగా, నా కంటి వేడి నీటి బిందువు ఆ నదిలో పడగా దానితోనే నా రాజ్యం ప్రేమకు తర్పణం యిస్తున్నానన్నంత తృప్తి మనసునకు గలిగి, కన్నులు తుడుచుకున్నాను.

నా రాజ్యం ఆత్మకు శాంతి చేకూరుగాక.